

# అభినవరాయలు

హిస్టరీ ప్రొఫెసరు నరసింగరావుగారు తన కొడుక్కి అచ్యుతరాయలని నామకరణం చేశాడు. ఆయన ప్రాణమిత్రుడు చక్రవర్తి అనే జ్యోతిష్కుడు అచ్యుతరాయలు జాతక చక్రం వేసి జాతకం చూశాడు.

''బాల గండాలున్నాయి నరసింగరావ్! అవి దాటితే రాయలు గొప్పవాడే అవుతాడు. విద్యలను పోషిస్తాడు. కళలను ఆదరిస్తాడు. వేదపండితులను గౌరవిస్తాడు. ఆయుష్మంతుడూ, ప్రయోజకుడూ, భాగ్యశాలీ అవుతాడు'' అని ముగించాడు. జాతక చక్ర పటం చూసి గ్రహగతి చూపాడు.

నరసింగరావుగారు సంతోషించి జ్యోతిష్కునికి ''జాతకమార్తాండ'' అని బిరుదిచ్చి, ఆయన గౌరవార్థం డాల్ఫిన్ హోటల్లో విందు యిచ్చాడు.

తన బిడ్డకి యేం గండాలోనని దిగులుపడ్డాడు నరసింగరావు. కాని రాయలు వళ్లు చేసి బొద్దుగా పెరిగాడు. రెండుసార్లు శీతపైత్య జ్వరానికీ, ఒకసారి కామెర్ల వ్యాధికీ, మరొకసారి సన్నిపాతానికీ, యింకోసారి గవదబిళ్లల వ్యాధికీ తట్టుకుని, బతికి బట్ట గట్టి బడికి వెళ్లాడు.

హెడ్మాష్టరు రాయలు అని పేరు వ్రాయించి సంతకం చేయించాడు. రాయలు కిండర్ గార్డెన్‌లో పరుగుపందెం, కళ్లగంతలాట, మెమొరీ టెస్ట్, శబ్దం విని చూడకుండా అదే వస్తువో చెప్పటంలో బహుమానాలు కొట్టాడు. ప్రొఫెసరు నరసింగరావు కొడుకుని చూసి గర్వపడ్డాడు.

యెదిగి చదువు పూర్తి చేస్తుండగా రాయలు సాంస్కృతిక మార్పిడీ స్కీమ్ మీద సహాధ్యాయుల వెంట విదేశం వెళ్లినప్పుడు పహిలాపచ్చీస్‌లో వున్నాడు. నూత్న యవ్వనం. కంటికి నదరుగా కనిపించే శరీరసౌష్ఠవం వున్నాయి. విదేశంలోనూ సుందరాంగులు, పట్టభద్రులు కాబోతున్నవారు అతని యీడు వారే తారసిల్లితే, అందానికీ ఆకర్షణకూ లోనైనాడు. వారిలో ఒక సుందరాంగి, ఉలూపి అనే నాగకన్య, భూప్రదక్షిణం చేస్తూ నది ఒడ్డున కూచుని దాన ధర్మాలు

చేస్తున్న అర్జునుని గుర్తుపట్టి, రాయల్ని పెనవేసుకుని తమ విల్లాకు తీసికెళ్లింది. ''నాకూ నా తండ్రికీ హిందూ మతమంటే గౌరవం డియర్. నా తండ్రి భారత్ వెళ్లి గంగాస్నానం చేస్తూ, విశ్వేశ్వరుని అన్నపూర్ణాదేవిని దర్శించి వస్తూవుండేవాడు. మేము ఆర్యసమాజ్ సభ్యులము నాకు హిందూ పురాణగాథలు తెలుసు. నా తండ్రి సూర్య అని పేరు మార్చుకుంటే నేను పద్మిని అని పెట్టుకున్నాను. ఓరియంటల్ లాంగ్వేజస్ నేరుస్తూ మీ తెలుగుగూడా అధ్యయనం చేశాను. నన్ను పద్మినీ అని పిలిస్తే సంతోషిస్తాను'' అని విదేశీ యాసతో తన ప్రేమ వెల్లడించింది.

పద్మిని సూర్యోదయం కాగానే విచ్చిన పద్మంలాగే వుంటుంది. నిర్మలమైన మంచినీటి సరస్సులో అందమైన కోమలమైన పద్మం ఒడ్డున నిలబడి కోసేంత అందుబాటులో వుంటే కోసుకోని వాడుంటాడా? కోసి మొహానికానించుకోని వాడుంటాడా? రాయలు చేతికందిన పద్మినిని గుండెలమీద పెట్టుకున్నాడు. ముళ్లు లేక మెత్తని కాడలాగా పద్మిని శరీరమున్నది. పద్మిని సైట్ సీయింగ్‌కి స్వంతకారులో తిప్పి తెచ్చింది. నయాగరా జలపాతం చూపింది. యేడున్నరకి రంగులు మారుతూ కనిపించేదాకా వుండి వచ్చారిద్దరూ. నొవ్వనాడదు. చర్చిపేరు గానీ, పచ్చతాడు గానీ, ప్రమాణాలు గానీ, ప్రామిసెస్ గానీ అడగలేదు. ముక్కుతాడు వేయలేదు. స్వర్గం చవి చూచాడు రాయలు.

2

ప్రొఫెసర్ నరసింగరావు గారు వుద్యోగ విరమణ చేశారు. పిత్రార్జితం పొదుపు వుద్యమ సాయంతో కాపాడటమేగాక, అంతో యింతో ధనాగారంలో వుంచాడు. చేతికెముక లేదని ఆశ్రితులంటే, వితరణశీలి అని బంధువులంటారు. అచ్యుత రాయల్ని వుద్యోగంలో పెట్టాడు ఓరోజు పిలిచి,

''అచ్యుతా! పెళ్లి నిశ్చయించాను నీకు. మంచి సాంప్రదాయం గలవారి అమ్మాయి. నువ్వు అడ్డు చెప్పవని, నిన్ను సంప్రతించలేదు'' అన్నాడు.

ఫుల్‌సూటులో నిలబడి వున్నాడు రాయలు.

''నాకు పట్టాభిషేకం జరగబోతున్నదన్నమాట. కాని నాన్నగారూ! ప్రిన్స్‌గానే ఫ్రీడమ్ యెక్కువ బాధ్యతలు తక్కువ'' అని నవ్వాడు.

''నీ ఫ్రీడమ్‌కి యెవరూ అడ్డురారు. అడ్డువచ్చినా నువ్వు మన్నించక్కర్లేదు. నేను చూడదలచినది చూసిపోతాను'' అని నిశ్చయంగా చెప్పాడు ప్రొఫెసరు. వాలుకుర్చీలో వున్నాడు. పట్టంచుల పట్టుధోవతీ, సిల్క్ లాల్చీ. పట్టంచుల వుత్తరీయం. కళ్లజోడూ, చిక్కని జుత్తు సగం నెరిసింది. జవాబుకోసం చూస్తున్నాడు నరసింగరావు.

''సరే. నేను రెడీయే'' అని నవ్వి వెళ్లిపోయాడు రాయలు.

పెళ్లి వైభవంగా జరిగిపోయింది. పెళ్లయిన మొదటి యేడే రాయలుకి కొడుకు గలిగాడు. ప్రొఫెసరు తాత అయి మనమడి చేత తాత అని పిలిపించుకుని సంతోషించాడు.

రాయలు తనకు శాస్త్ర సమ్మతంగా స్వాధీనమైన భార్యను స్టడీ చేశాడు. డెలివరీకెళ్లినప్పుడు ఒకే ఒక ప్రేమలేఖ వ్రాసింది భార్య సుశీల. తెలుగు ఆనర్స్ కనక గ్రాంథికం వాడింది.

'పట్టమహిషి అర్ధ్డాక్సు. నగలు దిగేసుకుంటుంది. కిరీటం మినహా అన్నీ పెట్టారు కన్నవారు'' అని నవ్వుకున్నాడు. ''కాని నగలు మొయ్యలేదు. సుకుమారి. నోములూ వ్రతాలు యిష్టం. పతివ్రతల కథలు చదువుతుంది. యేకపత్నీ వ్రతం యిష్టమేమో తనను ఆ వ్రతం పట్టమంటుందేమో ఖర్మ. నాకు చాతగాదే. నిరాశపడుతుందేమో. అనుకూలనాయకుడల్లే నటించాలి'' అని నవ్వుతున్నాడు రాయలు.

తల్లి మాచమ్మగారు, తన సంస్కృతిని కాపాడుకుంటూ, కోడలికి అసిస్టెంట్ హోదా యిచ్చింది. కాశీ వెళ్లి వచ్చింది. కాశీ సమారాధన చేసింది తన నగలు కూతురుకిచ్చింది. కాశీ మలేరియాకు వశమై వైకుంఠానికి కెళ్లింది.

నరసింగరావుగారు, మనమరాల్నీ గూడా ముద్దులాడి, దాని చేయిపట్టుకు

నడిపించి, వచ్చీరాని చిలకపలుకులు విని, తరించాననుకుని వైతరణి దాటి వెళ్లిపోయాడు.

ఇల్లు దిద్దుకు రావటం, వ్యవహారాలు నిర్వహించటం, వుద్యోగధర్మం నెత్తికెక్కి క్లబ్‌కీ, పేకాటకీ, కాక్‌టెయిల్ పార్టీలకి స్వస్తి చెప్పాలేమోనని బెంగపడ్డాడు రాయలు.

3

రాయలుకు ప్రమోషనొచ్చి, గెజెటెడ్ ఆఫీసరై గద్దీ యెక్కగానే, రాజలక్షణాలన్నీ బైటపడ్డాయి. వంది మాగధులూ, ఆశ్రితులూ చుట్టుముట్టితే తోలేయలేదు. సువారపు దొరలు చేరారింట్లో. భార్యావేపు వారూ. తన తల్లీ దండ్రీవేపు బాంధవులు. యిల్లు కలకలలాడించి, సందడి చేసేవారు. యాత్రలు ముగించి, యింటికెళ్తూ దోవలో రాయల్ని చూసిపోదామని దిగబడేవారూ, న్యాయం చేకూర్చమని పోరాటానికి వచ్చేవారూ, లలిత కళలో పండితులు, తమ కళ నశించకుండా చూడమంటే, సంగీతమూ నాట్యమూ, చిత్రలేఖనమూ నేర్పమని ట్యూషన్స్ చూపి ఆడపిల్లల్ని ప్రోత్సహించాడు.

స్వతహాగా అచ్యుత రాయలు ఆధునిక జీవితం యిష్టపడతాడు. ఫ్రిజ్, గ్రైండర్, కూలర్, గాస్ స్టౌ, ఎలక్ట్రిక్ స్టౌ, సీలింగ్ ఫాన్, దూరదర్శిని, వీడియో, రికార్డింగ్ మెషీన్, జంత్రీ వాయిద్యాలూ, మైక్రోవిన్, సూయింగ్ మెషీన్, క్రికెట్ సరంజామా, షటిల్ పరికరాలు, కుక్కర్, వేడినీళ్లు కాచి యిచ్చే గీసర్, టెలిఫోన్, ఫాక్స్ మెషీన్, యెలక్ట్రిక్ మోటార్ సైకిల్ కొన్నాడు. మెకానిక్కులు వచ్చి బాగుచేసి పోతూ వుంటారు. కారు మారుతీ డీలక్స్. డ్రైవర్‌కి యూనిఫామ్. కారు మిలమిల లాడేట్టు తుడిచి వుంచుతాడు డ్రైవరు.

అలా చిన్నసైజు రాజ్యమేలుతున్నాడు రాయలు.

విదేశీయులు మనరాష్ట్రంలో, మనదేశంలో పెట్టుబడిపెట్టి, వ్యాపారం చేసుకోవాలనీ, పరిశ్రమలు స్థాపించాలనీ, మనదేశ ప్రభుత్వం ఆహ్వానించి

సదుపాయాలు చూపుతామన్నది. అట్టి అవకాశం అందుకుని పద్మినీ వారి కుటుంబమూ, రాయలున్న పట్నం వచ్చి, తమ డబ్బుతో వ్యాపారం పెట్టుకున్నారు. పద్మిని కూతురు పేరే లైలా. వారు స్నేహం నెరపుతూ రాయలు భవనానికివచ్చిపోతూ వుంటారు. రాయలు భవనంలో స్వంత సంతానం గాక బంధువుల పిల్లలూ వున్నారు. ఇంటి ముందు తోటలో ఆడుకుంటూ కనిపిస్తారు.

రాయలుకి సమర్ధతా పరపతీ పెరిగినాయి. రక్షణశాఖలో, న్యాయశాఖలో, వైద్యరంగంలో, క్లబ్బులో పరిచితులూ మిత్రులూ యేర్పడ్డారు.

ఇలా రంగ రంగ వైభవంగా చిన్న సైజు యెస్టేట్ నడుపుకుంటున్న అచ్యుతరాయల్ని చూసి కొంతమంది అసూయతో దహించుకు పోయారు.

చిడిముడి పాటు లేదు. యెవరి మీదా అరవడు కక్ష గట్టడు. డబ్బు యిబ్బందులు లేవు. అన్నసత్రం లాగా యిల్లు నడుస్తున్నది. కొంతమంది వాళ్లే తమక్కావాల్సినవి వండుకుని తిని ఆనందించి వెళ్తూ వుంటారు. కొంతమంది మాంసాహారుల ఔట్‌హౌస్‌లో గప్‌చిప్‌గా వంట చేసుకుని విందు చేసుకుని నవ్వుకుంటారు.

కాక్‌టెయిల్ పార్టీగూడా యిస్తాడు.

సర్వెంట్ క్వార్టర్సులో డబ్బుపెట్టి పేకాడి వినోదిస్తారు. రాత్రి పది అవుతుంది.

మేడమీద సంగీత కచేరీ జరుగుతుంది. డ్రింకులూ మిక్చరూ అందిస్తారు పనివారు.

కూతురు పుట్టిన రోజు అని డాన్స్ ప్రోగ్రామ్‌పెట్టి వేదికగట్టి, ఆరుబయట సోఫాలు వుంచితే నృత్య ప్రదర్శన చూడటానికి ఆఫీసర్లు వస్తారు.

ఇండోర్ గేమ్స్, అవుట్‌డోర్ గేమ్స్ ఆడుతూ పిల్లలు కంటబడతారు.

కుక్కపిల్లలతో ఆడుతూ చిన్నారులు కన్నుల పండువు చేస్తారు.

ఒకటీ అరా రికార్డింగ్ చేసే టెక్నీషియన్స్ వస్తూ కంటబడతారు.

ఇంత డబ్బెక్కడిదీ? లంచాలు పడతాడని పేరు మోయలేదే అని విస్తుపోయారు.

ఉండబట్టలేక రాయలు యెస్సెట్సు యెంతదాకా వున్నాయి? పైకి తీయాలని, ఆదాయానికి మించిన వ్యయం యెలా చేస్తున్నాడనీ యంక్వయరీ మొదలెట్టారు కూపీదారులు.

నల్లధనం యెక్కడెక్కడ దాచాడో కనిబెట్టమని స్పెషల్ కూపీదారులను నియమించారు. కొంతమంది పౌరులు సాయం చేస్తామన్నారు.

రాయలు లోగిలిలో మోహనాంగి అనే అమ్మాయి, బంధువే, జమిందారు ఫాయాలో నడవడి చూపుతుంది. చేతులు తిప్పుతూ దాక్షీకం చేస్తుంది. పనివాళ్ల మీద అజమాయిషీ చేస్తుంది. వెలగల స్వీటూ హాటూ, పండ్లూ తెప్పించుకు తింటుంది. కేజీ కిస్‌మిస్ గుత్తీ కొంటుంది. దానిమ్మ పండ్లు అనాస కొంటుంది. దినపత్రికలూ వారపత్రికలూ కొని చదువుతుంది. ఆకలౌతున్నదని పకోడీలు బజ్జీలూ చేసి తాను తిని పందారం చేస్తుంది నౌకర్లకు. నాలుగైదు జంత్రీ వాయిద్యాలు యింపుగా వాయిస్తుంది. ఇంట్లో తక్కిన జనానా సభికులలాగా కూచుని వింటారు.

ఇది కళ్లారా చూసిన ఇంటెలిజన్షియా నోరు వెళ్లబెట్టారు.

రాయలు భవనం పక్కన తోటలో స్టాండు యినపవుయ్యాల అందమైనది ఫిక్స్ చేయించాడు. జవలిపెంలాంటి చీరగట్టి, రవిక లేకుండా, పొడవైన కేశరాశి విరబోసుకుని వుయ్యాల వూగుతూ సమ్మోహనాస్త్రం లాంటి నవ్వు నవ్వుతుంది. గుట్టు లాగుదామని వచ్చినవారికి మతిబోతుంది.

గోడలకు పెన్సిల్‌స్కెచెస్‌కాక వాన్‌గోగ్ వాటర్ కలర్ చిత్రాలు వేలాడుతూ ఆకర్షిస్తాయి. హనుమ తన గుండెలు చీల్చి చూడగా సీతారాములు కనిపించుట. గోపిక కృష్ణుని ఆరాధించుట పెన్సిల్ స్కెచెస్. మీరా తంబూరా మీటుతూ బసో మేరె నైనమే నందలాల్ అనే పతం లైట్ అండ్ షేడ్ యిచ్చింది. చాలా బావున్నది.

యెవరు గీశారో అని చూస్తూ నిలబడ్డారు, వేగువారు.

మతిబోయినట్టు చూస్తూ నిలబడిన కూపీ దారులను చూసి పై అధికారులు కూకలేశారు.

''శుష్కప్రియాలూ శూన్యహస్తాలతో రమ్మనా మిమ్మల్ని నియమించిందీ?'' అన్నారు.

''యేమో సార్! మాకేమీ అంతుబట్టలేదు. సంగీతం నేర్పే మాస్టరూ, డాన్సు నేర్పే పంతులమ్మా, చిన్న పిల్లలకు క్లాసుకాగానే టిఫిన్‌తిని కాఫీ తాగి వెళ్లిపోతారు. ఒక మేష్టరు సంగీతం పరీక్ష హయ్యరుకి కోచింగ్ యిస్తున్నాడు. మరొక పండితుడు సంస్కృత పరీక్షకి పంపుతున్నాడు. ఇంట్లో ఆశ్రితులు, ఇన్‌పేషంట్సూ, ఇద్దరు బావమరుదులూ, ఒకరు భార్యవేపు బావమరిది అయితే మరొకడు సోదరి భర్త వచ్చారు. వారికి వరుసక్రమంలో రెండొందలాభై ఆరువేలూ అప్పుకావాలని జబర్దస్తీ చేస్తున్నారు రాయలు బాబుని. కన్నతల్లిగారి కాలు పడిపోయి లేవలేరుట వారి నిమిత్తమై ఒక వంటామెమడిగా వండి తినిపిస్తున్నది. ఒక డ్రైవరుకి వెయ్యిజీతం ప్లస్‌రూమూ దీపం నీళ్లూ ఫ్రీ'' అని కళ్లు పెద్దవి చేసి తిప్పుతూ చెప్పాడు.

మరొకడు నట్టుకొడుతూ అన్నాడు.

''బాంక్ బాలెన్స్ నిల్ సార్. నేలమాళిగ వున్నదేమో నాకు కానరాలేదు. కర్రతో యింట్లో నేలమీద కొట్టుతూ చూశాను సార్. తివాసీ కింద తలుపులేదు. మోపెక్ టైల్స్ పరిపించాడు రాయలు బాబు. స్వంత సంతు నలుగురు విశ్వవిద్యాలయంలోకి నడిచి వెళ్లారు. రిటైరైన తెలిసిన మాష్టర్లున్నారు. దీనస్థితిలో వున్నారని ముప్పై చొప్పున వృద్ధాప్యపు పింఛనీ అని నలుగురికి పంపుతున్నాడు బాబు. నేనుండగా రసీదులొస్తే అందుకున్నాను. సత్యప్రమాణకంగానే చెబుతున్నాను సార్. బుక్స్ కొనటంలో దిట్ట. గ్రంథ పిపాసి అనచ్చు సార్. అద్దాల బీరువాల్లో, షెల్ఫుల్లో, అద్దాల అల్మరల్లో, రాకుల్లో ప్రింటెడ్ బుక్స్. హిందీ,

తెలుగు, ఇంగ్లీష్, సంస్కృత గ్రంథాలున్నాయి. పుస్తక భాండాగారం పెట్టొడనచ్చు బాబు. పత్రికలూ బొత్తులు బొత్తులుగా బల్లమీదున్నాయి సార్. చివరి అబ్బాయి టివి బాగు చేస్తాడు. వి సి ఆర్ అమరుస్తాడు. వీడియో ఫిల్ముతీస్తాడు. ఇంట్లో వైరింగ్ చేసింది స్వంత అబ్బాయే'' అలా చెపుతూ మొహాన చెమట కర్చిప్‌తో అద్దుకున్నాడు.

నత్తితో అవస్థపడే మరో కూపీదారు నవ్వొచ్చేట్టు చెప్పుకెళ్లాడు.

''కృష్ణదేవరాయలుకి కానుకలిచ్చేవారుట సార్. అలాగా రాయలు బాబుకి రెండువేల నించీ పదివేలదాకా చేబదులిచ్చేవారున్నారు సార్. అంతేనా సార్! ఇంకో వింతైన సంగతి తెలిసింది. రాయలే అప్పటికప్పుడు తొంభై వేలూ, అంతకుపైగా, లక్ష వరకు అర్జంటుగా అప్పు యిప్పిస్తాడు సార్. రాతకోతలైపోతై. ఇబ్బందిలో వున్న అయ్యవారుగానీ, అమ్మగారుగానీ డబ్బు అందుకుని, వికసించిన మొహంతో వెళ్తారు. ఈ అచ్యుతరాయలుకి ట్రాప్ పెట్టి పట్టాలని చూస్తే సార్, చుట్టుతా మనుషులుంటారు, రామలింగడల్లే ఓ ఫ్రెండ్ అన్నివేపులా చూస్తూ యేదో సోదిచెపుతూ యెంతకీ పోడు'' అని ఆయాసపడ్డాడు.

చంచాగిరీ చేసే మరొక వాలంటరీ కూపీదారు అభిమానం వెల్లడించాడు.

'పెళ్లి ఆగిపోయేట్లున్నది కట్నం సమకూరలేదు అని తల్లడిల్లే తండ్రి వచ్చి తన వ్యధ చెప్పుకుంటే సార్, వడ్డీలేకుండా, పత్రం వ్రాయించకుండా యెనభైవేలు అప్పు యిప్పించాడు సార్ అచ్యుతరాయలు. తానే హామీ వున్నాడు. ఇటువంటివి ఒకటా? రెండా?

తన సోదరుల బిడ్డలకోసమని, మార్కుల యాచనకి వెళ్లి, మూడడుగులడిగి భువనత్రయం లాగి సోదరుడైన యింద్రునకిచ్చిన త్రివిక్రముని లాగా, బిడ్డలు పాస్ అయినారు అని ఫోన్ చేశాడు రాయలు. అందాకా యెందుకు సార్ ప్రాపగాండా చేసి, అనుజుని గెలిపించి పార్టీ నాయకుని చేయించాడు సార్. నా సంగతి చెపితే నమ్మరేమో. అడిగినప్పుడల్లా ఆదుకుంటూనే వున్నాడు

అచ్యుతరాయలు. నల్లధనమెక్కడ దాచాడో కనుగొనలేక పోయినాం గాని సార్! అప్పులివ్వగల యిప్పించగల స్తోమత అనే ధనం తెల్లధనంలాగా కనబడుతూనే వున్నది సార్!'' అని గుక్కతిప్పుకున్నాడు.

యెత్తైన ఆసనం మీదున్న గొప్పహోదాలో వున్న ఆఫీసర్, ఔరంగజేబ్‌లాగా కనపడుతూ, ''స్టాప్!'' అని అరిచాడు.

''రాయలు మీద యెంక్వయరీ మొదలెట్టి మనం ఔరంగ్‌జేబ్ పాదుషాలాగా అయినాం. కనక రాయలుకూ్కడా కొండ యెలుక అని బిరుదిద్దాము. బావుంటుంది. ఆర్నెల్లు ముట్టడి వేసినా, శివాజీ మహారాజ్‌కి ఆహారపదార్థాలెటువేపునించి సరఫరా అవుతున్నాయో, ఔరంగ్‌జేబు పాదుషాకి అంతుబట్టలేదుట. రాయలూ హిందూ మతోద్ధరణ చేస్తున్నాడేమో. జనులకు ప్రియమైనవాడేమో'' అని యంక్వయరీ ఆపేయించి, అందర్నీ పంపేసి తాను స్వగృహానికి వెళ్లాడు.